# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 13-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ఐక్యత, సమానత్వానికి ప్రతీకగా మహాకుంభ మేళా నిలుస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు.

- భారత రాజ్యాంగం ప్రజల అభీష్టానికి నిదర్శనమని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు.

- ఉడాన్ ప్రయాణీకుల కోసం త్వరలో ఉడాన్ యాత్రి కేఫ్‌ను ప్రారంభించనున్నామని కేంద్ర మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు.

- భారత రాజ్యాంగానికి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా లోక్ సభలో ప్రత్యేక చర్చ నిర్వహిస్తున్నారు.

- భారత్ - యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రక్షణ భద్రతా సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు.

=======================

ఐక్యత సమానత్వానికి సంకేతంగా "మహాకుంభ మేళా" నిలుస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. 2025లో జరిగే మహాకుంభ మేళా ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశమవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా, ప్రయాగ్‌రాజ్‌లో మౌలిక సదుపాయాలను పెంచడానికి వివిధ రైలు రోడ్డు ప్రాజెక్టులను సుమారు 5 వేల 500 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులను నరేంద్ర మోడీ ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఏక్ భారత్.. శ్రేష్ఠ్ భారత్ కు అసలైన సందేశం కుంభ మేళాగా అభివర్ణించారు. గంగా నదిని పరిశుభ్రం చేసే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టిందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 37 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత రాజ్యాంగానికి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా లోక్ సభలో రెండు రోజుల ప్రత్యేక చర్చని నిర్వహిసున్నారు. ఇందులో భాగంగా ఈ రోజు జరిగిన చర్చలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా మాట్లాడుతూ.. పౌరులను సురక్షితంగా ఉంచడానికి రాజ్యాంగం భద్రతా కవచంగా ఉందని అన్నారు. సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ఎంపీ అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ.... ప్రజాస్వామ్యానికి రాజ్యాంగమే ఆత్మ అని అన్నారు. 75 ఏళ్ల తర్వాత మళ్లీ రాజ్యాంగంపై సభలో చర్చ జరుగుతోందని ఆయన గుర్తు చేశారు. రాజ్యాంగం కేవలం చట్టాలు, హక్కులు విధులతో కూడిన పుస్తకం కాదని దేశానికి మార్గనిర్దేశం చేసే గొప్ప స్ఫూర్తి అని డిఎంకె పార్టీకి చెందిన ఎంపీ టి.ఆర్.బాలు అన్నారు. సమాజంలోని అన్ని వర్గాల సామాజిక, ఆర్థిక ప్రగతికి రాజ్యాంగం బాటలు వేస్తుందని జనతాదళ్ యునైటెడ్ ఎంపీ, కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ తెలిపారు. ఈ చర్చలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఎంపీ బైరెడ్డి శబరి కూడా పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

రాజ్యాంగం దేశ నాగరికత విలువల వ్యక్తీకరణగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు. భారత రాజ్యాంగం 75 సంవత్సరాల అద్భుత ప్రయాణంపై లోక్‌సభలో ప్రత్యేక చర్చ ఈ రోజు జరిగింది. ఈ చర్చను ప్రారంభించిన రక్షణ మంత్రి మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక అంశాలను రాజ్యాంగంలో ప్రస్తావించిందని అన్నారు. దీని వల్ల దేశ నిర్మాణానికి మార్గం సుగమం అయిందని తెలిపారు. భారత రాజ్యాంగం కేవలం అధికారిక పత్రం మాత్రమే కాదని, ఇది ప్రజల అభీష్టానికి నిదర్శనమని కేంద్రమంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 34 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

విమానాశ్రయాలలో ఉడాన్ పథకం ద్వారా ప్రయాణించే ప్రయాణికుల కోసం ప్రభుత్వం త్వరలో ఉడాన్ యాత్రి కేఫ్‌ను ప్రారంభించనుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా న్యూఢిల్లీలో అధికారిక శతాబ్ది ఉత్సవాల లోగోను ఆయన ఈ రోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విమానాశ్రయాలలో ప్రయాణికులకు సరసమైన ధరలకు ఆహారాన్ని అందించనున్నట్లుగా హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా మొదటి పైలట్ ప్రాజెక్ట్ కేఫ్‌ను కోల్‌కతా ఎయిర్ పోర్ట్‌లో నిర్వహిస్తామని, తర్వాత ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలోని అన్ని విమానాశ్రయాల్లో అమలు చేస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. అదే విధంగా విమానాశ్రయంలో ప్రయాణికుల సౌకర్యార్థం బయలుదేరే ప్రాంతాల్లో కియోస్క్‌లను ఏర్పాటు చేస్తామని పేర్కొంటూ...

(వాయిస్ 38 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పరస్పర ప్రయోజనం కోసం భారత్ - యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) రక్షణ భద్రతా సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో యుఎఇకి చెందిన షేక్ అబ్దుల్లా బిన్ జాయెద్ బిన్ సుల్తాన్ అల్ నహ్యాన్‌తో జరిగిన 15వ భారత్-యుఎఇ జాయింట్ కమీషన్ సమావేశంలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సుస్థిరత, భద్రత విషయంలో ఇరు దేశాలు ఒకే విధమైన వైఖరితో ఉన్నాయని తెలిపారు. ఈ క్రమంలో ఉభయ దేశాలు రక్షణ సహకారాన్ని పెంపొందించుకుంటున్నాయని పేర్కొంటూ....

(వాయిస్ 18 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

గడిచిన పదేళ్లలో దేశంలో రవాణా మౌలిక సదుపాయాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధించామని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి అన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... జాతీయ రహదారుల నెట్‌వర్క్ 1.6 రెట్లు పెరిగిందని వివరించారు. అదే విధంగా భారతమాల ప్రాజెక్టు కింద మొదటి దశలో 34 వేల 800 కిలోమీటర్ల జాతీయ రహదారులను నిర్మించాల్సి ఉండగా.. ఇప్పటికే దాదాపు 18 వేల 714 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని ఆయన పేర్కొన్నారు. దేశంలోని ఆపరేషనల్ ఎయిర్ పోర్టుల సంఖ్య రెండింతలు పెరిగిందని తెలిపారు. దీంతో భారతదేశం ప్రపంచ వ్యాప్తంగా 3వ అతిపెద్ద దేశీయ విమానయాన మార్కెట్‌గా ఆవిర్భవించిందని గుర్తు చేశారు. అదే విధంగా దేశంలో 97 శాతం రైలు మార్గాలను విద్యుదీకరించామని కేంద్ర సహాయ మంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వం 2014 నుండి చేసిన నిరంతర ప్రయత్నాల ఫలితంగా పాక్ జైళ్లలో మగ్గుతున్న 2 వేల 639 మంది భారతీయ మత్స్యకారులు విడుదలయ్యారని విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ తెలిపారు. ఈ రోజు లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ.... 2008లో కాన్సులర్ యాక్సెస్‌పై భారత్-పాకిస్థా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఇరు దేశాలు ఇతర జైళ్లలో ఉన్న ఖైదీలు, మత్స్యకారుల జాబితాలను పరస్పరం మార్చుకోవాల్సి ఉందని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీ - డెహ్రాడూన్ ఎక్స్ ప్రెస్ వేలో భాగంగా పూర్తి చేసిన తొలి దశను త్వరలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభిస్తారని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =